సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



చురుగ్గా భూహక్కు రీసర్వే

జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో చేపట్టిన రీసర్వే చురుగ్గా సాగుతోంది. ఇప్పటికే ఫేజ్-3 సర్వే పూర్తయ్యింది.

8లో ▸



124 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు

ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు.

8లో ▸

శ్రీవారికి చాత్మార్ ఉత్సవం



ద్వారకాతిరుమల: చాత్మార్ తిరునక్షత్రాన్ని పురస్కరించుకుని ద్వారకాతిరుమల దివ్య క్షేత్రంలో శ్రీవారి తిరువీధి సేవ బుధ వారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. భక్తులు నీరాజనాలు అర్పించారు.

న్యూస్‌రీల్

వేగంగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్



పరిశీలిస్తున్న జేసీ రామసుందర్‌రెడ్డి

ఉండి: సచివాలయాల్లో పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో పేదల ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను అధికారులు వేగంగా నిర్వహిం చాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ఆదేశించారు. బుధవారం ఉండి సచివాల యం-1 పరిధిలోని పాములపర్రు గ్రామానికి చెందిన పట్టాల రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. నూతన ఫార్మెట్ ద్వారా లబ్ధిదారులను పూర్తిస్థాయి హక్కుదారు లుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తిచేయాలన్నారు. ఆర్డీఓ కె.శ్రీనివాసులురా జు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్‌మా ధుర్, తహసీల్దార్ ఎడిద శ్రీనివాస్, ఎంపీడీఓ ఎస్.రవీంద్ర, పి.భార్గవ్‌రామ్ పాల్గొన్నారు.

డీఆర్వోగా ఉదయభాస్కర్

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి డీఆర్వోగా జింక ఉదయభాస్కర్ నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఇప్పటివరకు ఇన్‌చార్జి డీఆర్వో వ్య వహరిస్తున్న బి.శివన్నారాయణరెడ్డి కేఎల్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్‌గా కొనసాగనున్నారు. జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు బదిలీ కాగా ఆయన స్థానంలో ఆర్.విక్టర్‌ను డీపీఓగా నియమించారు.

పీఎం అవార్డులపై సమీక్ష

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని వివిధ శాఖల్లో కేంద్ర పథకాల అమలును వినూత్నం గా చేపట్టిన శాఖలు పీఎం అవార్డు నామినేషన్లకు సమాచారాన్ని సమర్పించాలని కలెక్టర్ పి.ప్ర శాంతి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రధానమంత్రి అవార్డ్స్ నామినేషన్లపై సంబం ధిత శాఖల అధికారులతో సమీక్షించారు.

జేఈఈ మెయిన్స్‌కు 725 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దేశంలో ప్రతిష్టాత్మక మైన ఎన్ఐటీ, ట్రిపుల్‌ఐటీ కళాశాలల్లో ఇంజనీ రింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (జేఈఈ) మెయి న్స్-1 పరీక్షలకు బుధవారం 739 మంది విద్యార్థులకు 725 మంది హాజరయ్యారు. ఉదయం షిఫ్టులో సిద్ధార్థ క్వెస్ట్‌లో 185 మందికి 184 మంది, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో 100 మందికి 99 మంది, సీఆర్‌ఆర్ ఇంజనీరిం గ్ కళాశాలలో 85 మందికి 83 మంది హాజర య్యారు. మధ్యాహ్నం షిఫ్టులో సిద్ధార్థ క్వెస్ట్‌లో 184 మందికి 178 మంది, ఏలూరు ఇంజనీరిం గ్ కళాశాలలో 100 మందికి 98 మంది, సీఆర్ ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 85 మందికి 83 మంది హాజరయ్యారు. పరీక్షలను కో-ఆర్డినే టర్ పి.సాయి కుమారి శంకర్ పర్యవేక్షించారు.

ఏఎస్పీగా స్వరూపరాణి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా అదనపు ఎస్పీగా జి.స్వరూపారాణి నియమితులయ్యారు. రాజ మహేంద్రవరం అదనపు ఎస్పీగా పనిచేస్తున్న ఆమెను ఇక్కడ నియమించారు. ఇక్కడ అద నపు ఎస్పీగా పనిచేస్తున్న ఎంవీవీ భాస్కరరా వును కాకినాడ అదనపు ఎస్పీగా బదిలీ చేశారు. ఎస్సీ, ఎస్టీ సెల్ విభాగంలో పనిచేస్తున్న ఉమా మహేశ్వరావును శ్రీకాకుళం బదిలీ చేశారు.



పేదలకు ఆరోగ్య భాగ్యం

- ఆపద వేళ అండగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ
- 2.05 లక్షల మందికి రూ.436.32 కోట్ల విలువైన శస్త్రచికిత్సలు
- 94 వేల మందికి రూ.53 కోట్ల మేర ఆరోగ్య ఆసరా
- అంతటా హర్షాతిరేకాలు

ప్రజారోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యమిస్తున్నారు. పేదలకు ఆపద ముంచుకొచ్చిన వేళ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆపన్నహస్తం అందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పశ్చిమగోదావరి జిల్లాలో రెండు లక్షల మందికి పైగా రోగులకు రూ.436 కోట్ల విలువైన శస్త్రచికిత్సలు చేయించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపారు. రూ.5 లక్షలు ఉన్న వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు, 1,059గా ఉన్న చికిత్సల సంఖ్యను 3,257కు పెంచడం ద్వారా పేదల ఆరోగ్యానికి మరింత భద్రత కల్పిస్తున్నారు. దీనిపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ

సంవత్సరం	శస్త్రచికిత్సల సంఖ్య	ప్రభుత్వ వ్యయం (రూ.కోట్లలో)
2019–20	19,505	48.03
2020–21	25,161	51.80
2021–22	37,063	75.58
2022–23	48,399	109.74
2023–24	75,657	151.17

వైఎస్సార్ ఆరోగ్య ఆసరా

సంవత్సరం	శస్త్రచికిత్సల సంఖ్య	ప్రభుత్వ వ్యయం (రూ.కోట్లలో)
2019–20	19,505	48.03
2019–20	4,487	2.80
2020–21	10,809	6.20
2021–22	18,518	9.40
2022–23	26,254	16.32
2023–24	34,240	18.59

సాక్షి, భీమవరం: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మో హన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్నారు. అనారోగ్య సమస్యలతో పేదలు ఆర్థికంగా దెబ్బతిన కూడదని క్యాన్సర్ లాంటి ఖరీదైన జబ్బుల చికిత్సకు పరిమితి లేకుండా అవసరమైన సాయం అందిస్తున్నారు. ఈ పథకం కింద అందించే చికి త్సల సంఖ్యను కూడా పెంచారు. శస్త్రచికిత్స అనం తరం రోగి కోలుకునే వరకు జీవనభృతి కోసం వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం కింద ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఆరోగ్యశ్రీ వ్యయ పరిమి తిని కూడా రూ.25 లక్షలకు పెంచారు.

ఓపెన్ హార్ట్ సర్జరీ తర్వాత స్కూల్‌కు..



పాలకొల్లు కొత్తపేటకు చెందిన కోళ్ల తేజశ్రీరామ నరసింహంకు తొమ్మి దేళ్లు. చిన్నతనం నుంచి గుండె సమ స్యతో బాధపడుతున్నాడు. తండ్రి సుబ్రహ్మణ్యం వెల్డింగ్ పని చేస్తుండగా తల్లి సాయిలక్ష్మి గృహిణి. కుమారుడికి వైద్యం కోసం ఎన్నో ఆస్పత్రులకు తిప్పారు. సొంత డబ్బులు రూ.2 లక్షల వరకు ఖర్చు చేశారు. గుండెకు శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచిం చగా గతేడాది విజయవాడలోని ప్రము ఖ ఆస్పత్రికి వెళ్లారు. ఆరోగ్యశ్రీ పథ కం కింద అక్కడి వైద్యులు ఉచితంగా ఓపెన్‌హార్ట్ సర్జరీ చేశారు. నరసిం హం పూర్తిగా కోలుకుని పాలకొల్లు గురుకుల పాఠశాలలో 3వ తరగతి చదువుకుంటున్నాడు. ఈ పథకం ద్వారా రూ.3 లక్షల లబ్ధి చేకూరినట్టు తల్లి సాయిలక్ష్మి ఆనందంగా చెబుతున్నారు.

రూ.3.20 లక్షల ఖర్చుతో ఆపరేషన్లు



నరసాపురం మండలం వేములదీవికి చెందిన నంద్యాల మణికంఠ తాపీపని చేస్తుంటారు. ఐదు నెలల క్రితంలో నరసాపురంలో పని ముగించుకుని మోటారుసైకిల్‌పై ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఎడమకాలు మూడు చోట్ల విరిగిపో యింది. చేతిలో రూపాయి లేదు. భీమవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.3.20 లక్షల విలువైన ఆపరేషన్లు రెండుసార్లు ఉచితంగా చేశారు. 15 రోజులపాటు ఆస్పత్రిలో ఉండగా.. ఇంటికి వచ్చేటప్పుడు వైఎస్సార్ ఆసరా కింద రూ.10 వేలు ఆయన ఖాతాలో జమచేశారు. మణికంఠ ప్రస్తుతం ఇం టి వద్దే ఉంటున్నారు. ప్రభుత్వం మందులు కూడా ఉచితంగా అందిం చిందని, సీఎం జగన్‌కు రుణపడి ఉంటానని ఆయన అంటున్నారు.

తండ్రీ కొడుకులిద్దరూ జీవం పోశారు



భీమవరం రూరల్ మండలం రాయలం గ్రామానికి చెందిన ముత్యాలపల్లి మణి గృహిణి. ఆమె ఫ్యాన్సీ షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆమెకు రెండుసార్లు గుండె సమస్య రాగా ఆరోగ్యశ్రీ ఆమెను బతికించింది. దివంగత వైఎస్సార్ హయాంలో హైదరాబాద్ లోని నిమ్స్‌లో ఆరోగ్యశ్రీ ద్వారా ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. మరలా 2021లో ఆమెకు సమస్య తలెత్తడంతో మళ్లీ గుండెకు ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. దీంతో ఆరోగ్యశ్రీ కింద హైదరాబాద్ సన్‌షైన్ ఆస్పత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారు. మొత్తంగా రూ.8 లక్షలు ఖర్చయ్యే ఆపరేషన్లు ఆమెకు ఉచితంగా చేశారు. ఒకసారి తండ్రి, మరోసారి తనయుడు తనకు జీవం పోశారని ఆమె అంటున్నారు.

ఆరోగ్యశ్రీతో పునర్జన్మ



మొదటి నుంచి టీడీపీ కార్యకర్తగా పనిచేశాను. 2021లో నాకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో రూ.1.50 లక్షల వరకు ఖర్చ వుతుందన్నారు. పేదరికంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న నాకు ఏలూరులోని ఆస్ప త్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేశారు. అలాగే ఇంటి వద్ద పోషణ కోసం రూ.10 వేలు నా ఖాతాలో వేశారు. ఆరోగ్యశ్రీ పునర్జన్మను ఇచ్చింది.

– ఇసుకపాటి విశ్వేశ్వరరావు, వేల్పూరు, తణుకు మండలం

జగన్‌బాబు దయతోనే..



ఒంట్లో బాగోలేదని ఆస్పత్రికి వెళితే క్యాన్సర్ అని వైద్యులు చెప్పారు. మా అబ్బాయిని తీసుకుని విజయవాడలోని క్యాన్సర్ ఆస్పత్రికి వెళ్లాం. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఇప్పటికి ఆరుసార్లు కిమో థెరపీ చేశారు. ఏడోసారి ఫిబ్రవరి 15న రమ్మన్నారు. నాకు పౌష్టికాహారం కోసం రోజుకు రూ.250 చొప్పున రూ.5 వేలు నా ఖాతాలో వేశారు. జగన్‌బాబు మేలును మరువలేం.

–వాసిరెడ్డి సుబ్బాయమ్మ, చినకాపవరం, ఆకివీడు మండలం

పార్టీలకు అతీతంగా..



పార్టీలు, మతాలు, కులాలకతీతంగా అర్హులందరికీ పథకాలు అం దుతున్నాయి. కమ్యూనిస్టు పార్టీకి చెందినా నాకు ప్రభుత్వం చాలా మేలు చేసింది. 2022లో బ్రెయిన్ ట్యూమర్ రావడంతో రూ.10 లక్షల వరకు ఖర్చవు తుందన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో రాజమండ్రిలోని కార్పొరేట్ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేశారు. అలాగే ఖర్చుల నిమిత్తం రూ.8,400 ఇచ్చారు.

– వీరా పాండు రంగారావు, మొగల్తూరు

'సిద్ధం'కు భారీ ఏర్పాట్లు

- 3న వైఎస్సార్‌సీపీ ఎన్నికల శంఖారావం
- 50 నియోజకవర్గాల నుంచి కేడర్ రాక
- 110 ఎకరాల్లో సభా ఏర్పాట్లు
- పరిశీలించిన ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ తలశిల, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, అబ్బయ్యచౌదరి



సభా వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్

సాక్షిప్రతినిధి, ఏలూరు: వైఎస్సార్‌సీపీ ఎన్నికల శం ఖారావ సభకు అట్టహాసంగా ఏర్పాట్లు జరుగుతు న్నాయి. బహిరంగ సభా వేదిక నిర్మాణం మొదలు పార్కింగ్ వరకు పనులను యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. ఈనెల 3న ఏలూరు జిల్లా దెం దులూరు సమీపంలోని సహారా గ్రౌండ్స్‌లో జరిగే సిద్ధం సభకు ఉమ్మడి గోదావరి జిల్లాలతో పాటు కృ ష్ణా జిల్లాలోని మొత్తం 50 నియోజకవర్గాల నుంచి లక్షల సంఖ్యలో పార్టీ కేడర్ తరలిరానున్నారు. బుధ వారం పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మి థున్‌రెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, కొఠారు అబ్బయ్యచౌదరి, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్, చింత లపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు ఏ ర్పాట్లను పరిశీలించారు. అనంతరం సిద్ధం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

110 ఎకరాల్లో.. సభ జరిగే 110 ఎకరాల విస్తీ ర్ణాన్ని పూర్తిగా చదును చేసి ముస్తాబు చేస్తున్నారు. సభా ప్రాంగణం వెనుక భాగంలో హెలీప్యాడ్ నిర్మా ణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. కలెక్టర్ వె.ప్ర సన్నవెంకటేష్, ఎస్పీ డి.మేరీ ప్రశాంతి హెలీప్యాడ్ నిర్మాణ పనులను పరిశీలించి బందోబస్తుపై చర్చిం చారు. ఎమ్మెల్సీ తలశిల రఘురాం పూర్తిస్థాయిలో సభా ప్రాంగణం వద్దనే ఉంటూ పనులను పర్యవే క్షిస్తున్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎం పీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, దూలం వినయ్, యడ్ల తాతాజీ, బీసీసెల్ అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, డాక్టర్ దిరిశాల వరప్రసాద్, కో-ఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్ పాల్గొన్నారు.

ఏడు ప్రాంతాల్లో పార్కింగ్ : సభా ప్రాంగణానికి అన్ని ప్రధాన రహదారుల్లో ఏడు ప్రాంతాల్లో 150 ఎకరాల పార్కింగ్ స్థలాన్ని సిద్ధం చేస్తున్నారు. సభా ప్రాంగణానికి కుడి వైపు, ఎడమవైపు 65 ఎకరాలు, వాటి సమీపంలో మరో 10 ఎకరాలు, ఆటోనగర్ లోపల, ఆశ్రం కళాశాల ప్రాంగణంలో, పిచ్చుకల నాగేశ్వరరావు లేఅవుట్‌లో మరో 40 ఎకరాలు మొత్తంగా 150 ఎకరాలను పార్కింగ్‌కు సిద్ధం చేస్తు న్నారు. సభా ప్రాంగణం మొదలు జాతీయ రహ దారితో పాటు ఏలూరు నగరంలో భారీగా పార్టీ శ్రేణులు సిద్ధం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

పూర్తిస్థాయిలో బందోబస్తు

ఉత్తరాంధ్ర రీజియన్‌కు సంబంధించి భీమిలిలో సిద్ధం సభ గ్రాండ్ సక్సెస్ కాగా.. దీనికి మించి ఇక్కడ సభ ను విజయవంతం చేసేలా భారీ ఏర్పాట్లు చేస్తు న్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా అన్నిచర్యలు తీసుకోవడంతో పాటు బందోబస్తుపైనా పూర్తిస్థా యిలో దృష్టి సారించారు. అలాగే సభ విజయవం తానికి జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని ఆదేశించారు. చింతలపూడిలో పార్టీ సమ న్వయకర్త కంభం విజయరాజు నేతృత్వంలో, ఏలూరు జిల్లా పార్టీ కార్యాలయంలో, ఏలూరు నగరంలోని అన్ని డివిజన్‌లలో సమావేశాలు నిర్వహించారు.

ధాన్యం కమీషన్ సొసైటీలకు అందించాలి

ఏలూరు(మెట్రో): జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి పూర్తి కమీషన్ సొసైటీలకు అందిం చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సహకారశాఖ అ ధికారిని ఏలూరు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదే శించారు. బుధవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి ఆయన పాల్గొన్నారు. వ్యవసా యశాఖ ప్రచురించిన చిరుధాన్యాలతో రుచికర మైన వంద రకాల వంటలు పుస్తకాన్ని ఆవిష్కరిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కమీషన్ ఎఫ్‌డీ చేసే నిబంధన సడలించి సొసైటీలు గోనె సంచులు కొనుగోలు చేసుకునే వీ లుగా కమీషన్ పూర్తిగా సొసైటీలకు అందేలా చర్య లు తీసుకోవాలన్నారు. కాలువలు, డ్రెయిన్‌లలో తూడు, గుర్రపుడెక్క తొలగింపు తదితర ఇరిగేషన్ పనులపై జెడ్పీ చైర్‌పర్సన్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పశ్చిమ డెల్టాకు సంబంధించి షట్టర్ల మరమ్మతులు, ఉంగు టూరు నియోజకవర్గంలోని కాలువలు, డ్రెయిన్లలో తూడు, గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు తీసు కోవాలన్నారు. సభ్యులు చిట్టూరి వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖ అధికారి వై.రామకృష్ణ పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యం పెంచేలా 'ఆడుదాం ఆంధ్ర'





బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ శ్రీనివాస్, పోటీల ప్రారంభ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం: ప్రపంచవ్యాప్తంగా క్రీడల్లో రాష్ట్ర ప్రాతి నిధ్యాన్ని పెంపొందించడం, క్రీడాకారుల సత్తాను తెలియజేసే లక్ష్యంతో ఆడుదాం ఆంధ్ర పోటీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యా ప్తంగా పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేశారని ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. బుధవారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇం జనీరింగ్ కళాశాల ఆవరణలో ఆడుదాం ఆంధ్ర జిల్లాస్థాయి ఆటల పోటీల ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడ లను ప్రోత్సహించడానికి జిల్లాలో గ్రామ, వార్డు, మండల, నియోజకవర్గ స్థాయిల్లో నిర్వహించిన పోటీల్లో 5,350 జట్లు పాల్గొన్నాయన్నారు. క్రీడల ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఆనందం, ఆరోగ్యం క్రీడలతోనే సాధ్యమని ఆడుదాం ఆంధ్ర ద్వారా యువతలో క్రీడా స్ఫూర్తిని నింపడమే లక్ష్య మన్నారు. జిల్లావ్యాప్తంగా క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడాంశాల్లో పోటీలు నిర్వ హించగా జిల్లాస్థాయి పోటీలకు మహిళలు, పురు షులు 70 జట్లు పోటీపడుతున్నాయన్నారు.

భీమవరంలో జిల్లాస్థాయి ఆటల పోటీలు

రాష్ట్రస్థాయి పోటీలకు ఐదు జట్లు

జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి మాట్లా డుతూ జిల్లాలోని 535 సచివాలయాల పరిధిలో పోటీలు నిర్వహించగా జిల్లాస్థాయిలో గెలుపొందిన ఐదు జట్లు విశాఖలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. భీమవరం డీఎన్నార్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారా యణరాజు (బాబు) పోటీల నిర్వహణకు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ముందుగా ప్రభుత్వ విప్ శ్రీనివాస్, కలెక్టర్ ప్రశాంతి అధికారులు కపో తాలను ఎగురవేసి పోటీలను ప్రారంభించగా ప్రభు త్వ విప్ శ్రీనివాస్ క్రికెట్ బ్యాటింగ్ చేసి ఆకట్టుకు న్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.శ్రీనివాసులురాజు, జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు, డీఎల్‌డీఓ ఏవీ అప్పారావు, తహసీ ల్దార్ వై.రవికుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం. శ్యామల, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరె క్టర్ ఎం.జగపతిరాజు, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బా బు, ఎంపీపీ పేరిచర్ల విజయ నర్సింహారాజు, డీఎస్ డీఓ ఎం.రాజేష్, పీడీ పీఈటీ అసోసియేషన్ సెక్ర టరీ ఎండీ ఖద్దూష్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పీఎస్ఎన్ మల్లేశ్వరరావు, చీఫ్ కోచ్ ఎం.దుర్గారావు పాల్గొన్నారు.

వెలుగులు నింపిన ఆసరా



జిల్లావ్యాప్తంగా వైఎస్సార్ ఆసరా సంబరాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా రుణమాఫీని వైఎస్సార్ ఆసరా పథకం కింద అందిస్తున్నారు. దీనిలో భాగంగా నాలుగో విడత ఆసరా సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రజాప్రతినిధులు మహిళలకు చెక్కులు అందిస్తుండగా.. లబ్ధిదారులు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. – పెనుగొండ

మహిళల ఆర్థిక పరిపుష్టికి..

మహిళలకు ఆర్థిక పరిపుష్టిని కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఎన్నికల ముందు డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ ఆసరాతో రుణమాఫీ చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది.

– చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఆచంట ఎమ్మెల్యే
(తూర్పుపాలెంలో జరిగిన ఆసరా కార్యక్రమంలో..)



తూర్పుపాలెంలో మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ షర్మిలా రెడ్డి

కుట్టుమెషీన్ కొనుక్కున్నా..



వైఎస్సార్ ఆసరా డబ్బులతో కుట్టుమెషీన్, జిగ్‌జాగ్ మెషీన్ కొనుక్కుని కుటుంబానికి అం డగా నిలిచాను. మా కుటుంబ ఆదాయం కూడా పెరిగింది. మహిళలకు అండగా నిలిచిన సీఎం జగన్‌కు జీవి తాంతం రుణపడి ఉంటాను.

– టీవీవీ సురేఖ, కొడమంచిలి, ఆచంట మండలం

కుటుంబానికి ఆసరాగా..



వైఎస్సార్ ఆసరాతో వచ్చిన నగదు కుటుం బానికి ఆసరాగా నిలిచింది. అలాగే కోవిడ్ సమయంలో ప్రాణాపాయ స్థితికి వెళ్లిన నా భర్త ప్రాణాలను ఆరోగ్యశ్రీ ద్వారా కాపాడిన మహనీయులు సీఎం జగన్, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు. వారి మేలు మరువలేను.

– బొంతు మేరీ, పండిత విల్లూరు, పోడూరు మండలం

క్లుప్తంగా

సేంద్రియ సాగుపై పరిశోధనకు మానుకొండకు అవార్డు



మధ్యప్రదేశ్‌లో శాస్త్రవేత్తలతో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్

పెనుగొండ : సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ విధానంపై తాను చేసిన పరిశోధనకు జాతీయ స్థాయి ఉత్తమ పరిశోధన అవార్డు లభించిందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలోని సస్యవిజ్ఞాన విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జనవరి 28, 29, 30 తేదీల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ కృషి విశ్వవిద్యాలయంలో జాతీయ స్థాయి సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ విధానాలు–నూతన వ్యవసాయ పోకడలుపై సదస్సు నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా సమర్పించిన పరిశోధనా పత్రానికి జాతీయ స్థాయి ఉత్తమ అవార్డు ఇచ్చారని వివరించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి మరోసారి జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్నారు. మూడు రోజుల సమావేశంలో మూడు దేశాలు, 28 రాష్ట్రాల నుంచి 250 మంది శాస్త్రవేత్తలు పాల్గొన్నారన్నారు. మానుకొండ శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల

ఏలూరు(మెట్రో): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జిల్లా సబ్ జైల్స్, ఏలూరు వారి కార్యాలయంలోని ఒక జూనియర్ అసిస్టెంట్ కం టైపిస్టు పోస్టు నియామకం కొరకు మెయిన్స్ పరీక్ష రాసిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అభ్యర్థుల మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితా జిల్లా కార్యాలయానికి వచ్చిందన్నారు. సదరు మెరిట్ జాబితాను అభ్యర్థుల పరిశీలనార్థం 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ ఏలూరు డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్', 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ వెస్ట్‌గోదావరి డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లలో పొందుపరచడమైనదని పేర్కొన్నారు.

చురుగ్గా భూహక్కు రీసర్వే

- ఫేజ్–3లో 104 గ్రామాల్లో 1.56 లక్షల ఎకరాల్లో సర్వే
- ఇప్పటివరకు 174 గ్రామాల్లో 2.22 లక్షల ఎకరాల్లో పూర్తి
- త్వరలో మిగిలిన 2.92 లక్షల ఎకరాల రీసర్వేకు చర్యలు
- ఏళ్ల తరబడి భూసమస్యల పరిష్కారంతో సర్వత్రా హర్షం

జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో చేపట్టిన భూముల రీసర్వే పశ్చిమగోదావరి జిల్లాలో చురుగ్గా సాగుతోంది. ఇప్పటికే ఫేజ్–1, ఫేజ్–2 పూర్తి కాగా, తాజాగా ఫేజ్–3 సర్వే కూడా పూర్తయింది. ఫేజ్–3లో జిల్లాలో 20 మండలాల్లోని 104 గ్రామాల్లో 1,56,06 ఎకరాల్లో సర్వే పూర్తి చేసి 33,783 భూహక్కు పత్రాలు పంపిణీ చేశారు. డ్రోన్, ఆర్థోరెటిఫైడ్ ఇమేజ్, రోవర్ వంటి అధునాతన పరికరాలతో ప్రణాళికబద్ధంగా భూముల రీసర్వే ప్రక్రియ వేగంగా జరుగుతోంది. ఇప్పటికే సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు భూహక్కు పత్రాలు అందించడంతో పాటు సచివాలయాల్లోనే భూముల రిజిస్ట్రేషన్లు చేస్తుండటం విశేషం.

భీమవరం (ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 5.17 లక్షల ఎకరాలు ఉండగా, ఇందులో ప్రైవేట్ భూమి 4.56 లక్షల ఎకరాలు, ప్రభుత్వ భూమి 61 వేల ఎకరాలు ఉంది. ఇప్పటివరకు జిల్లాలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో మొత్తం 294 గ్రామాల్లో రీసర్వే చేయాలని లక్ష్యంగా కాగా, ఫేజ్–1లో 16 గ్రామాల్లో 9,412.07 ఎకరాల్లో, ఫేజ్–2లో 54 గ్రామాల్లో 57,206.706 ఎకరాల్లో, తాజాగా ఫేజ్–3లో 104 గ్రామాల్లో 1,56,206.27 ఎకరాల్లో కలిపి మొత్తం మూడు విడతల్లో 2,22,825 ఎకరాల్లో భూములను సర్వే పూర్తి చేశారు. కాగా, మరో 120 గ్రామాల్లో 2.92 లక్షల ఎకరాల్లో సర్వే చేపట్టాల్సి ఉంది. ఇందుకు అధికార యంత్రాంగం వేగంగా సర్వే పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటోంది.

63,982 భూహక్కు పత్రాల పంపిణీ

జిల్లాలో ఇప్పటివరకు పూర్తి చేసిన మూడు విడతల రీసర్వేలోని భూములకు సంబంధించి రైతులకు 63,982 భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఇందులో ఫేజ్–1లో 5,656 భూముల యజమానులకు పత్రాలను అందించారు. ఫేజ్–2లో 30,199 భూహక్కు పత్రాలు, ఫేజ్–3లో 33,783 భూహక్కు పత్రాలను అధికారులు పంపిణీ చేశారు.



పోడూరులో భూముల రీసర్వే చేస్తున్న సిబ్బంది



అత్తిలి సచివాలయంలో భూ రీసర్వే, రిజిస్ట్రేషన్ల తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పరిష్కారమవుతున్న భూసమస్యలు

98 ఏళ్ల క్రితం నాటి బ్రిటీష్ పాలకులు రాష్ట్రంలో భూములను సర్వే చేసి వ్యవసాయం, గ్రామ కంఠం, ప్రభుత్వ భూములుగా విభజించి వాటిని రికార్డుల్లో నమోదు చేశారు. నాటి నుంచి భూముల రీసర్వే చేపట్టలేదు. దీనికి తోడు అప్పటి రికార్డులు పాడవ్వడంతో భూముల వివరాలు లభించడం కష్టంగా మారింది. దీంతో గ్రామాల్లో భూసమస్యలు నెలకొన్నాయి. వీటి పరిష్కారంపై శ్రద్ధ తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భూముల రీసర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. ఉచితంగా భూముల రీసర్వే చేయించడం, సర్వే చేయించిన భూముల చుట్టూ కొలతల ప్రకారం సర్వే రాళ్లు ఉచితంగా వేయించి రైతుల మధ్య భూసమస్యలు లేకుండా చేస్తున్నారు. దీంతో ఏళ్ల తరబడి ఉన్న భూసమస్యలు పరిష్కారమవుతున్నాయి. అలాగే అన్యాక్రాంతమైన ఆలయ భూములు, గ్రామ కంఠం భూములు బయటపడుతున్నాయి.

రైతుల్లో హర్షాతిరేకాలు

భూములను రీసర్వే చేసి నూటికి నూరుశాతం విస్తరణ, కచ్చితమైన హద్దులను నిర్ధారించి రాళ్ల కూడా ఉచితంగా పాతిచడంపై రైతులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా భూముల రీసర్వే చేపట్టలేదని, కేవలం జగనన్న ప్రభుత్వంలోనే భూముల రీసర్వే జరుగుతోందని, ఇది చాలా గొప్ప కార్యక్రమమని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మండలాల వారీగా రీసర్వే వివరాలు

మండలం	గ్రామాల సంఖ్య	ఫేజ్–1లో (ఎకరాలలో)	ఫేజ్–2లో (ఎకరాలలో)	ఫేజ్–3లో (ఎకరాలలో)
పాలకోడేరు	12	–	4704.87	13071.38
భీమవరం	6	548.89	2244.34	7532.13
వీరవాసరం	11	22959.11	580.10	5527.45
అత్తిలి	13	500.20	7226.30	8192.34
తణుకు	3	768.81	1180.68	1790.50
తాడేపల్లిగూడెం	8	–	6690.55	11697.23
పెంటపాడు	16	125.20	8159.72	10477.70
గణపవరం	13	–	5453.52	4878.28
నర్సాపురం	7	883.16	–	6717.27
మొగల్తూరు	1	1865.12	–	–
యలమంచిలి	6	530.85	–	5637.50
పాలకొల్లు	6	405.77	2228.42	3452.89
ఆచంట	4	390.02	–	4591.74
పోడూరు	7	770.31	–	6745.45
పెనుమంట్ర	6	304.51	–	6659.77
పెనుగొండ	11	251.81	–	13629.60
ఉండి	14	703.01	2378.73	16845.21
కాళ్ల	8	493.60	5138.24	7701.88
ఆకివీడు	8	–	3448.43	11832.97
ఇరగవరం	14	290.71	–	9224.97

సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం

జిల్లాలో ఇప్పటివరకు మూడు విడతల్లో భూముల రీ సర్వే జరిగింది. 172 గ్రామాల్లో 2.22 లక్షల ఎకరాల్లో సర్వే పూర్తి చేశాం. రీసర్వేలో జిల్లా వ్యాప్తంగా సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వే సిబ్బంది 500 మంది వరకు పనిచేస్తున్నారు. సర్వేలో భూమికి సంబంధించి ఏ సమస్య వచ్చినా ఆయా మండలాల డిప్యూటీ తహసీల్దార్లకు ఫిరాద్యు చేస్తే సమస్య పరిష్కరిస్తారు.

– జి.జాషువా జిల్లా సర్వే అధికారి

రైతు ముంగిటకు ఉద్యాన సేవలు

తాడేపల్లిగూడెం: ఉద్యాన పంటలు, యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్ సదుపాయాలు, కొత్త పంటలు తదితర విషయాలపై ఉద్యాన రైతుల్లో మరింత అవగాహన పెంచేందుకు డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆడియో, విజువల్ వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఉద్యాన వర్సిటీ ఉప కులపతి డాక్టర్ తోలేటి జానకీ రామ్ ఆధ్వర్యంలో 2020 అక్టోబర్ రెండున శ్రీకారం చుట్టిన 'మన గ్రామం–మన విశ్వవిద్యాలయం' కార్యక్రమం ఉత్తమ ఫలితాలను ఇచ్చింది. ఈక్రమంలో గడచిన 14 సంవత్సరాలుగా ఉద్యాన, వ్యవసాయ, పశుపోషణ, మత్స్యపోషణ, అనుబంధ రంగాలలో విశేష సేవలందిస్తున్న వెంకట్రామన్నగూడెంలోని కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యాన కళాశాల, ఉద్యాన పరిశోధన స్థానం, ఉద్యాన పాలిటెక్నిక్ వంటి సంస్థలతో సుమారు 44 సంస్థలు ఈ కార్యక్రమం కింద ప్రతి ఏటా ఒక గ్రామాన్ని దత్తత తీసుకుంటోంది. నాలుగేళ్లగా పండుగూడెం, రావిగూడెం, పోలసానిపల్లి, నారాయణపురం వంటి గ్రామాలను దత్తత తీసుకున్నాయి. వర్సిటీ అభివృద్ధి కార్యక్రమాలను పుస్తక రూపంలో ప్రచురిస్తున్నారు. ఈ సేవలను మరింత విస్తృతం చేసే ప్రణాళికలో భాగంగా సంచార ఉద్యాన విస్తరణ సేవల వాహనాన్ని ప్రారంభించారు.



వర్సిటీ ఏర్పాటు చేసిన ఆడియో విజువల్ వాహనం

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన

ఆర్‌బీకే చానల్ కోసం రికార్డు చేసిన వీడియోలను ఈ వాహనం ద్వారా ప్రదర్శిస్తారు. వర్సిటీ ద్వారా విడుదలైన వంగడాలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తారు. వర్సిటీలో లభించే ఉత్పత్తులు, జీవన ఎరువులు, జీవనియంత్రణ కారకాలపై సమాచారం అందిస్తున్నారు. రైతులు తమ ఉత్పత్తులపై రైతు సమాచార కేంద్రం 96180 21200 నంబర్‌కు తెలియజేయడం ద్వారా వాటిని గ్రామాల్లోనే విక్రయించే అవకాశం కల్పిస్తారని వర్సిటీ విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ తెలిపారు.

ముగిసిన ఇంటర్నేషనల్ వెబినార్

కైకలూరు: పర్యావరణ శాస్త్రాల్లో పరిశోధన పద్ధతి అనే అంశంపై స్థానిక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ వెబినార్ బుధవారంతో ముగిసింది. కళాశాలలో డిపార్టుమెంట్ ఆఫ్ కెమిస్ట్రీ, ఫిజిక్స్, బోటనీ, జువాలజీ, కాలేజ్ ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యాన మంగళవారం ఈ వెబినార్ ప్రారంభమైంది. ప్రిన్సిపాల్ బి.రఘునాథరెడ్డి అధ్యక్షతన చివరి రోజు మొదటి సెషన్‌లో ఐర్లండ్ ప్రొఫెసర్ అరుల్ మణికందన్ 'సస్టెనబుల్ బయో రిఫైనింగ్ ఆఫ్ మెరైన్ ఆల్గే టూ ప్రొడ్యూస్ ఇడిబుల్ అండ్ నాన్ ఇడుబుల్ ప్యాకేజీ ఫిలిమ్స్ టూ కంబాట్ ప్లాస్టిక్ పొల్యూషన్' అనే అంశంపై ప్రసంగించారు. అదే విధంగా రెండో సెషన్‌లో ఇజ్రాయేల్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.సత్వంత్ 'ఏ కాంప్రహెన్సివ్ గైడ్ టూ క్రాఫ్టింగ్ ఏ సస్టెనబుల్ రీసెర్చ్ పేపర్స్' అనే అంశంపై వెబినార్‌లో వివరించారు. రాజమండ్రికి చెందిన కళాశాలల రీజినల్ డైరెక్టర్ డాక్టర్ సి.కృష్ణ పర్యావరణ అంశాలను వివరించారు. స్థానిక అధ్యాపకులు కె.సంధ్య, డి.పాల్ దివాకర్ సంధానకర్తలుగా వ్యవహించారు. వైస్ ప్రిన్సిపాల్ ఉదయ్ ప్రకాష్, అధ్యాపకులు ఆర్.జాలబాబు, జ్ఞానప్రసూనాంబ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో పలువురికి అదనపు బాధ్యతలు



నూతనంగా నియమితులైన వారితో డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి ఏవోగా సీఎస్‌ఈ విభాగంలో పనిచేస్తున్న టీ చంద్రశేఖర్‌ను, ఇన్‌చార్జి ఫైనాన్స్ అధికారిగా ఈసీఈలో పనిచేస్తున్న బీ శ్రీనాథ్‌ను, ఎస్.రత్నాకర్‌ను డీన్ అకడమిక్స్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీచేశారు. అకడమిక్ విధులను బలోపేతం చేసే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామని, వీరందరూ ఏడాది పాటు ఈ విధుల్లో ఉంటారన్నారు. అలాగే ఇప్పటివరకు ఈ బాధ్యతలు నిర్వహించిన వారిని అభినందించారు.

వెబ్‌సైట్‌లో దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల మెరిట్ లిస్ట్

ఏలూరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాల నియామకాలకు సంబంధించి మెరిట్ లిస్టును, రిజెక్టెడ్ లిస్టును ఏలూరు జిల్లా వెబ్‌సైట్‌లో ఉంచినట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ లిస్టు, రిజెక్టెడ్ లిస్టులో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా తగిన పత్రాలతో నేరుగా ఏలూరులోని విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో హాజరుకావాలని కోరారు. గడువు అనంతరం అందే అభ్యంతరాలను పరిశీలించే అవకాశం లేదన్నారు.

124 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు

ఏలూరు (మెట్రో): ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఇంటర్మీడియట్ పరీక్షల ఏర్పాట్లపై ఇంటర్మీడియెట్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ జిల్లా కమిటీ సభ్యులు విద్యాశాఖ, పోలీస్, విద్యుత్, వైద్యశాఖ, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో డీఆర్‌ఓ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలను మూడు దశలుగా నిర్వహిస్తామని, జిల్లాలో 124 పరీక్షా కేంద్రాల్లో మొదటి, రెండో సంవత్సరానికి సంబంధించిన మొత్తం 32,445 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. మొదటి సంవత్సరం 15,656, రెండో సంవత్సరం 16,789 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఫిబ్రవరి 2న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, 3న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలను తప్పనిసరిగా రాయాల్సి ఉంటుందన్నారు. ఫిబ్రవరి 5 నుంచి 20 వరకు ప్రాక్టికల్ పరీక్షలు (ఒకేషనల్), 29 సెంటర్లలో, ఫిబ్రవరి 11 నుంచి 20వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు (జనరల్) 69 కేంద్రాల్లో రెండు పూటలా నిర్వహిస్తున్నామన్నారు. మార్చి 1 నుంచి 20 వరకు థియరీ పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నిరంతరం పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు పరీక్ష సమయానికి కంటే ఒక గంట ముందు చేరుకోవాలన్నారు. పరీక్ష నిర్వహణ రోజుల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా బస్సులను పరీక్ష వేళలకు అనువుగా రీషెడ్యూల్ చేసి నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీములను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డీవీఈఓ, కన్వీనర్ డీఈసీ బి.ప్రభాకరరావు, అడిషనల్ ఎస్పీ ఎన్‌ఎస్‌ఆర్ శేఖర్, డీఎస్పీ చంద్రశేఖర్, డీపీవో టి.శ్రీనివాస విశ్వనాథ్, డీఈఓ శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు

వైభవంగా సామూహిక సత్యదేవుడి వ్రతాలు





శ్రీసత్యనారాయణ స్వామి వ్రతం చేయిస్తున్న అర్చకులు, వ్రతం ఆచరిస్తున్న వందలాది దంపతులు

దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహణలో ధర్మ ప్రచార ప్రరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మప్రచార మహోత్సవాలలో భాగంగా బుధవారం శ్రీబలుసులమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సామూహిక శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. పట్టణ పరిసర ప్రాంతాల నుంచి సుమారు 2 వేల మంది దంపతులు వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. వ్రతంలో వైఎస్సార్ సీపీ యువ నేత కొట్టు విశాల్, తల్లి సౌదామిని పాల్గొన్నారు. అన్నవరం దేవస్థానం ఉపప్రధాన అర్చకులు వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అన్నవరం దేవస్థానం నుంచి తీసుకువచ్చిన శ్రీసత్యనారాయణస్వామి వారి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు. – తాడేపల్లిగూడెం అర్బన్

పశ్చిమలో భారీగా తహసీల్దార్ల బదిలీ

భీమవరం (ప్రకాశంచౌక్): రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పశ్చిమగోదావరి జిల్లాలో 22 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల నిబంధనలను అనుసరించి జిల్లాలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న తహసీల్దార్లకు స్థానచలనం కలిగింది.

తహసీల్దార్	ప్రస్తుతం	బదిలీ అయిన జిల్లా
పి.లక్ష్మి	గణపవరం	కృష్ణా
వై.అప్పారావు	తాడేపల్లిగూడెం	రాజమహేంద్రవరం
జి.వి.శేషగిరి	పెంటపాడు	ఎన్టీఆర్
ఎం.బి విజయలక్ష్మి	డీఏఓ నర్సాపురం	కృష్ణా
ఎన్.గురుమూర్తి నాయుడు	ఆకివీడు	కృష్ణా
ఎం.సునీల్ కుమార్	ఉండి	కృష్ణా
ఎస్‌కే హుస్సేన్	పాలకోడేరు	కోనసీమ
ఎస్‌వీ సుబ్రహ్మణ్యం	ఆచంట	కోనసీమ
ఆర్‌వీ కృష్ణారావు	పోడూరు	కోనసీమ
ఎం.సుందర్రాజు	వీరవాసరం	కృష్ణా
జి.అనితకుమారి	మొగల్తూరు	కోనసీమ
ఎస్‌డీ మౌలానాఫాజిల్	నర్సాపురం	ఏఎస్ఆర్
వై.రవికుమార్	భీమవరం	కృష్ణా
జి.పెద్దిరాజు	పాలకొల్లు	కోనసీమ
ఎస్.వెంకటేశ్వరరావు	పెనుగొండ	కృష్ణా
డీవీఎస్ అశోక్‌వర్మ	పెనుమంట్ర	కోనసీమ
ఏవీ రామాంజనేయులు	అత్తిలి	కృష్ణా
వై.శ్రీనివాస్	ఇరగవరం	కృష్ణా
పీ.ఎస్‌డీవీ ప్రసాద్	తణుకు	కృష్ణా
వై.దుర్గాకిషోర్	ఏఓ కలెక్టరేట్, భీమవరం	కృష్ణా
ఆర్.రాంబాబు	సూపరింటెండెంట్, కలెక్టరేట్, భీమవరం	కృష్ణా
సీహెచ్ రవికుమార్	సూపరింటెండెంట్, కలెక్టరేట్, భీమవరం	కృష్ణా

పులి సంచారంపై హెచ్చరికలు

జంగారెడ్డిగూడెం రూరల్: పులి సంచారం అటు ప్రజలకు, ఇటు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో ఎక్కువగా సంచరించడంతో బుధవారం మండలంలోని లక్కవరం, పంగిడిగూడెం గ్రామాల్లో అటవీశాఖ అధికారులు మైక్ ద్వారా ప్రజలకు, రైతులు, పశుకాపరులకు హెచ్చరికలు చేశారు. రాత్రి సమయాల్లో పొలాలకు వెళ్లడం, నిద్రించడం చేయరాదన్నారు. పగటి పూట పొలాలకు రైతులు ఒంటరిగా వెళ్లరాదని సూచించారు. పొలాల్లో పులి పాదముద్రలు కనిపిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నరసాపురం చర్చిలకు శతాబ్దాల చరిత్ర



వార్షికోత్సవంలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును సత్కరిస్తున్న దృశ్యం

నరసాపురం: నరసాపురం ప్రాంతంలో చర్చిలకు శతాబ్దాల చరిత్ర ఉందని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. పట్టణంలోని మొగల్తూరు రోడ్డులో ఉన్న లూథరన్ చర్చి (పెద్దచర్చి) 100వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మోషేన్‌రాజు మాట్లాడుతూ బ్రిటీష్ హయాంలో శతాబ్దం క్రితం నిర్మించిన చర్చిలో జరుగుతున్న వేడుకలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. నరసాపురం ప్రాంతంలో ఇటువంటి క్రీస్తు దేవాలయాలు అనేకం ఉన్నాయన్నారు. చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన చర్చిని వందేళ్లుగా కాపాడుతున్న స్థానిక సంఘ సభ్యులను అభినందించారు. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ ఇక్కడి క్రైస్తవ మిషనరీలు సేవా కార్యక్రమాల్లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయన్నారు. బ్రిటీష్ హయాంలోనే ఈ ప్రాంతంలో చర్చిల నిర్మాణం జరిగిందన్నారు. మోషేన్‌రాజును, ముదునూరిని ఘనంగా సత్కరించారు. క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మేడిది జాన్సన్, డైరెక్టర్ నళినీజాన్‌కుమార్, చర్చి కమిటీ ప్రతినిధులు ఎంఎస్ మార్టిన్స్, బి.ధర్మరాజు, పీసీసీ చైర్మన్ బి.ఆనందరాజు, ట్రెజరర్ జి.జయరాజు, పి.సుందరబాబు, కృపావరం పాల్గొన్నారు.

నాడు కాలుష్య కాసారాలు.. నేడు ఆహ్లాద నిలయాలు

- కృష్ణుడు చెరువు, కాలువ రేవుల అభివృద్ధి
- 23వ వార్డు ప్రజల్లో ఆనందం


చెరువు మధ్యలో శ్రీకృష్ణుడు



శ్రీకృష్ణుడు చెరువు వద్ద గేటు, శిలాఫలకం


శ్రీకృష్ణుడు చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్


చెరువులో శ్రీకృష్ణుడు మందిరం వద్దకు నిర్మించిన వంతెన


ఆధునికీకరించిన చిన్న ముత్యాలమ్మ తల్లి రేవు


ఆధునికీకరించిన వినాయకుడి గుడి రేవు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం 23వ వార్డు పరిధిలో ఉన్న కృష్ణుడు చెరువు, ఏలూరు వైపు వెళ్లే కాలువలో రెండు రేవులు కాలుష్య కాసారాలుగా మారి దుర్గంధం వెదజల్లేది. ఆ దారి వెంట వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సివచ్చేది. మెట్లు దిగి చెరువులో కాళ్లు కడుక్కుంటే దురదలు మొదలయ్యేవి. ఇదంతా గతం. నేటి పరిస్థితి ఇందుకు విరుద్ధం. నేడవి ఆహ్లాదానికి నెలవుగా మారాయి. చెరువు, కాలువ రేవుల వద్ద స్థానికులు కూర్చుని సేదతీరుతున్నారంటే పరిస్థితిని అర్థంచేసుకోవచ్చు.

ఆహ్లాదంగా చెరువు, పరిసరాలు

కృష్ణుడు చెరువుకు ఎన్నో ఏళ్లుగా ఇన్‌లెట్, అవుట్‌లెట్‌లు సరిగా లేవు. దీంతో పక్కనే ఉన్న మురుగుబోదె నీరు చెరువులోకి ప్రవేశించి దుర్గంధం వెదజల్లేది. ఈ చెరువు వద్ద వాకింగ్ ట్రాక్ అభివృద్ధి, ఇతర పనులకు డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ గతేడాది జూన్ నెలలో శంకుస్థాపన చేశారు. పురపాలక సంఘం నిధులు రూ.6.10 లక్షలు కేటాయించగా, దాతలు సుమారు రూ.7 లక్షలు అందజేశారు. ఈ నేపథ్యంలో చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేశారు. ఫెన్సింగ్ లోపల ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసేందుకు ట్రాక్ నిర్మించారు. చెరువు మధ్యలో ఉన్న శ్రీకృష్ణుడికి చక్కని మందిరం, కృష్ణుడు గుడికి వెళ్లేందుకు వీలుగా చిన్న వంతెన నిర్మించారు. నీరు బయటకు పోయేందుకు ఇన్‌లెట్ ఏర్పాటుతో పాటు, బోర్ నిర్మించడంతో ఆ బోరు నీటిని చెరువులోకి పంపింగ్ చేసి నింపుతున్నారు. ఫలితంగా చెరువు, పరిసరాలు ఆహ్లాదకరంగా మారాయి.

కాలువ రేవులకు కొత్త శోభ

23వ వార్డులో శ్రీవినాయక రేవు చెత్త చెదారాలతో నిండి ఉండేది. దీంతో దాతలు స్వచ్ఛందంగా సమకూర్చిన రూ.3.40 లక్షలతో రేవును అభివృద్ధి చేశారు. రేవు వద్ద ఆధ్యాత్మిక శోభ పెంచేందుకు వినాయకుడు విగ్రహం, శివలింగం, ఆంజనేయ స్వామి విగ్రహం, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సర్పాలను ఏర్పాటు చేశారు. బ్రిక్స్‌తో ఆవరణను మెట్లు ల్యాండ్‌ను నిర్మించి సుందరీకరణ చేశారు. కార్తీక మాసంలో, ఇతర పుణ్య రోజుల్లో కాలువల వద్దకు భక్తులు వచ్చి స్నానాలు ఆచరిస్తున్నారు. మరో రేవు చిన్న ముత్యాలమ్మ తల్లి రేవు సైతం పురపాలక సంఘం గ్రాంట్ రూ.5 లక్షలతో అభివృద్ధి చేశారు. రేవుల్లో స్నానం చేసేవారు మునిగిపోకుండా ఉండేందుకు వీలుగా కాలువలో కాంక్రీట్ పిల్లర్స్‌తో రైలింగ్, హెచ్చరిక కోసం రక్షణ ఏర్పాట్లు చేశారు. నేడు రేవులు కొత్త శోభను సంతరించుకున్నాయి.

మంత్రి కేఎస్ఎన్‌కు అభినందనలు



శ్రీకృష్ణుడు చెరువు, ఏలూరు కాలువ రేవుల అభివృద్ధికి ప్రోత్సహించిన డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణకు అభినందనలు. వార్డులో పలు అభివృద్ధి పనులు చేశారు. స్థానికుల సహాయ సహకారాలు కూడా అందాయి. ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా మంచి వాతావరణం ఏర్పడటం సంతోషంగా ఉంది. అందరికీ కృతజ్ఞతలు.

– పట్నాల గణపతి, వైఎస్సార్ సీపీ తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి

పరిశుభ్రమైన వాతావరణం



చెరువు సుందరీకరణతో దుర్గంధం పోయింది. పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడింది. ప్రజల ఆరోగ్యం కోసం ఉదయమే నడిచేందుకు వాకింగ్ ట్రాక్ నిర్మాణంతో ఆనందంగా ఉంది. ఏలూరు కాలువలో రెండు రేవులను అభివృద్ధి చేశారు. స్నానం చేసే సమయంలో ప్రవాహంలో కొట్టుకు పోకుండా రక్షణ ఏర్పాట్లు చేయడం అభినందనీయం. కృతజ్ఞతలు.

– కాట్రగడ్డ రమేష్, యజమాని, లక్కీ రోడ్డు లైన్స్ ట్రాన్స్‌పోర్టు

క్లుప్తంగా

చినతాడేపల్లి వెల్‌నెస్ సెంటర్ పరిశీలన


చినతాడేపల్లి వెల్‌నెస్ సెంటర్ రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని చిన తాడేపల్లి వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాన్ని కేంద్రం బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు ప్రశాంత్ ఎస్ కాప్సే, ఎం రాధాలక్ష్మి మాతా శిశు సంరక్షణ, బీపీ, సుగర్, వెల్‌నెస్ సెంటర్ నిర్వహణ, రోగులకు అందుతున్న వైద్య సేవలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను తనిఖీ చేశారు. వీరి వెంట జిల్లా క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ అనిత విల్సన్, డాక్టర్ సీహెచ్ శ్రీహర్ష, సీహెచ్‌ఓ సూర్యకాంతం, ఎంపీహెచ్ఈఓ సీహెచ్ జ్యోతిర్మయి, ఎంఎల్‌హెచ్‌పీ జి.దివ్య, వీహెచ్ఎస్ఎన్ ఆదిలక్ష్మి, ఆశాలు జి.శాంతికుమారి, సీహెచ్ సాహితీ తదితరులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం


డ్రెయిన్‌లో సిల్టు తీస్తున్న వర్కర్లు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వీ శ్రీమన్నారాయణ అన్నారు. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు, పురపాలక సంఘం కమిషనర్ శామ్యూల్ పర్యవేక్షణలో బుధవారం ప్రైవేటు వర్కర్స్‌తో పాతూరులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలు ప్రధాన డ్రెయిన్లలో షిల్ట్ తీయించారు. వ్యర్థాలను తొలగించారు. రైల్వే ట్రాక్ వద్ద కోడులో కచ్చా డ్రెయిన్‌ను మీటరు వెడల్పు, మీటరు లోతులో తవ్వించారు. పరిసర ప్రాంతాల్లోని వృథానీరు వేగంగా పారేందుకు వీలుగా అవుట్ లెట్‌కు చేరేందుకు డ్రెయిన్‌లో అడ్డంకులను తొలగించారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజల సహకారం కూడా తమకు కావాలన్నారు.

యద్దనపూడి సేవలు చిరస్మరణీయం


యద్దనపూడి స్మారక అవార్డు కార్యక్రమంలో పాల్గొన్న జర్నలిస్టులు, తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పత్రికారంగానికి, సమాజానికి యద్దనపూడి సూర్యనారాయణ మూర్తి చేసిన బహుముఖ సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ సీనియర్ పాత్రికేయులు యద్దనపూడి స్మారక అవార్డు ప్రదానోత్సవం ఏపీయూడబ్ల్యూజే జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎంపీడీఓ సభా మందిరంలో నిర్వహించారు. ఉత్తమ జర్నలిస్ట్ పురస్కారం మామిడిశెట్టి శ్రీరాంప్రసాద్ కు అందజేసి సత్కరించారు. సీనియర్ పాత్రికేయులు పీవీఏ ప్రసాద్, వి.నాగేశ్వర లింగమూర్తి, ఐతా సురేష్‌లను సత్కరించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల టెన్త్ టాపర్ అలేఖ్యకు నగదు పారితోషికం, జ్ఞాపిక, నూతన వస్త్రాలు అందజేశారు. తొలుత యద్దనపూడి విగ్రహం వద్ద నివాళులర్పించారు. బీవీఆర్ వ్యవస్థాపకుడు బుద్దాల వెంకట రామారావు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చింతకాయల బాబూరావు, త్యాగరాజ గాన సభ అధ్యక్షుడు గరికపాటి బాపయ్య శర్మ, ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు టి.రంగసురేష్ తదితరులు హాజరయ్యారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు


భీమవరంలో ఉద్యోగ విరమణ చేసిన పోలీసు సిబ్బందిని సత్కరించిన జిల్లా ఎస్పీ

భీమవరం: ప్రజలకు దాదాపు 40 ఏళ్లపాటు అంకితభావంతో సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందిని పోలీసు శాఖ గుర్తుంచుకుంటుందని ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఉద్యోగ విరమణ చేసిన భీమవరం వన్‌టౌన్ ఏఎస్సై కె.జిలాని, పాలకోడేరు ఏఎస్సై జేవీఎస్ సాయిబాబు, తాడేపల్లిగూడెం ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరరావు, వీరవాసరం హెడ్ కానిస్టేబుల్ వి.సత్యనారాయణను సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వర్తించినందుకు అభినందనలు తెలిపారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, ఏఆర్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ, ఎస్బీ సీఐ తిలక్, డీసీ ఆర్బీ సీఐ డి.వెంకటేశ్వరరావు, ఏవో రామమోహనరావు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో విద్యనభ్యసించాలి


తణుకు మహిళా కళాశాలలో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

తణుకు టౌన్: ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో విద్యనభ్యసించి, పట్టుదలతో లక్ష్యాలు సాధిస్తూ ఉన్నత స్థానాలను సాధించాలని గుంటూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వీఎస్ రాజ్యలక్ష్మి చెప్పారు. బుధవారం తణుకులోని ఎస్‌కేఎస్‌డీ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో వడ్డే సుబ్బారావు రాసిన తాపీ చెక్కిన శిల్పం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, వివేకానంద గ్లోబల్ స్కూల్ సెక్రటరీ చిట్టూరి రీనా సాయి, కళాశాల చైర్మన్ కేవీ సుబ్బారావు, కోశాధికారి నందిగం సుధాకర్, ప్రభుత్వ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎస్ మనోరమ, డీవీవీఎస్ వర్మ, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. వివిధ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


తణుకులో కల్లుగీత కార్మిక సంఘం పతాకం ఆవిష్కరించిన రాష్ట్ర నాయకులు

తణుకు: రాష్ట్రంలో కల్లుగీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. కల్లుగీత కార్మిక సంఘం 15వ రాష్ట్ర మహాసభలు తణుకులో బుధవారం ముగిశాయి. రెండో రోజు జరిగిన మహాసభల్లో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. స్థానిక లయన్స్ క్లబ్ ఆవరణలో సంఘం పతాకాన్ని రాష్ట్ర అధ్యక్షుడు జుత్తిగ నర్సింహమూర్తి ఆవిష్కరించారు. అమరవీరులు ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, ఎస్.ఆర్.దాట్ల, చిటకన వెంకటేశ్వరరావుతోపాటు ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు మహాసభలో ప్రతినిధులు నివాళులర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 జిల్లాలు నుంచి సుమారు 250 మంది గీత కార్మికులు ప్రతినిధులుగా హాజరయ్యారు. ఈ మహాసభలకు అధ్యక్ష వర్గంగా జుత్తిగా నరసింహమూర్తి, కామన మునిస్వామి, గుబ్బల నాగమణి, స్టీరింగ్ కమిటీ యర్రా దేముడు, ఎం.స్టాలిన్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ,ఆంధ్రప్రదేశ్ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా దేముడు, కార్యదర్శి చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య, ప్రొఫెసర్ జుత్తిగ చంద్రప్రసాద్, మట్టా వెంకట్, రాష్ట్ర నాయకులు సిమ్మ అప్పారావు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి


మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రాణ రక్షణ కోసం హెల్మెట్‌ధారణ తప్పనిసరని రవాణా శాఖ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) డి.సురేంద్రసింగ్ నాయక్, సీఐ ఎ.సుబ్రహ్మణ్యం, ట్రాఫిక్ ఎస్సై వి.సుబ్రహ్మణ్యంలు పేర్కొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు సందర్భంగా బుధవారం రవాణా శాఖ యూనిట్ కార్యాలయం వద్ద నుంచి పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. డ్రైవింగ్ స్కూల్ శిక్షణా స్టూడెంట్స్, బజాజ్ షోరూం సిబ్బంది, స్థానికులు హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం ద్వారా తమను తాము రక్షించుకోవాలని, తమ కుటుంబాన్నీ రక్షించుకోవాలని సూచించారు. మోటార్ వాహనాల చట్టం సెక్షన్ 129 ప్రకారం హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, లేకుంటే చట్టంలోని సెక్షన్ 177 ప్రకారం జరిమానా రూ.1000 విధిస్తామని హెచ్చరించారు. ఫిబ్రవరి 19వ వరకు నిర్వహించే వివిధ కార్యక్రమాలను విజయవంతంచేయాలని కోరారు.

వ్యసనాలకు దూరంగా ఉండండి


జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్న మిత్ర

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థులు, యువకులు చిన్ననాటి నుంచే చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు మల్లిపూడి మిత్ర అన్నారు. దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు మల్లిపూడి కనదుర్గ ఆధ్వర్యంలో మిత్ర అవుట్ రీచ్ అండ్ డ్రాప్ ఇన్ సెంటర్ (ఓడీఐసీ) వారిచే బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరుతూ అవగాహన కల్పించారు. మిత్ర మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కొందరు ఫ్యాషన్ కోసం మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, ఇది సరికాదని తెలిపారు. మంచివారిని స్నేహితులుగా ఎంపిక చేసుకోవాలని, చెడు వ్యక్తులకు దూరంగా ఉండాలని సూచించారు. ఉజ్వల భవిష్యత్తు కోసం జీవన నైపుణ్యాలను నేర్చుకోవాలన్నారు. భవిష్యత్తుకు బాటలు వేసే మంచి చదువులను చదవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్‌వీ రమణ, మాణిక్యాల రాజా, నాగార్జున, శ్రీనివాస్, పి.దేవి, పి.మోహన్ దుర్గ, వై.హర్ష వర్ధన్, ఎస్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ఆకివీడు: విజయవాడ నుంచి ఆకివీడులోని తన సోదరి ఇంటికి వచ్చిన బాలిక(15) కన్పించకుండా పోయిందని ఆమె సోదరి సూర్యకుమారి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.నాగబాబు చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి బాలిక కన్పించకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేశారన్నారు.

భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలు


భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగులకు ఫిజియోథెరపీ ఎంతో ఉపయుక్తమని డాక్టర్ అల్లు శ్రీకృష్ణ మహేష్ పేర్కొన్నారు. స్థానిక సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల శిక్షణ దివ్యాంగుల కేంద్రంలో బుధవారం దివ్యాంగులకు డాక్టర్ శ్రీకృష్ణ మహేష్‌చే ఫిజియోథెరపీ నిర్వహించారు. నిత్యం ఫిజియోథెరపీ చేయడం ద్వారా పిల్లల్లో వైకల్య శాతం తగ్గి ఇతరులపై ఆధారపడకుండా వారి పనులు వారే చేసుకోగలుతారని చెప్పారు. ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య మాట్లాడుతూ భవిత కేంద్రంలో సరిగా నడవలేని పిల్లలకు ప్రతి బుధవారం ఫిజియోథెరపీ చేస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేక విద్య, మాటలు సరిగా రాని వారికి స్పీచ్ థెరపీ, డిజిటల్ విద్య ద్వారా బధిరులకు తదితర విద్యార్థులను ఉచిత సమగ్ర శిక్ష ద్వారా ట్యాబ్స్ అందజేస్తున్నామని, ప్రత్యేక విద్య ద్వారా దివ్యాంగుల పిల్లల్లో మార్పు తీసుకురానున్నామని వివరించారు. తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌కు ఏర్పాట్లు


అత్తిలి గ్రామ సచివాలయంలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ ఎస్ రామ్‌సుందర్‌రెడ్డి

అత్తిలి: నిరుపేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేష్లన ప్రక్రియ ప్రారంభించేందుకు అధికారులు, సిబ్బంది సంసిద్ధులుగా ఉండాలని జేసీ ఎస్ రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం అత్తిలి-1 గ్రామ సచివాలయంలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా ఆన్‌లైన్‌లో పొందుపర్చిన ఫార్మాట్లను జేసీ స్వయంగా పరిశీలించి, అధికారులకు దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన నూతన ఫార్మేటు ద్వారా లబ్ధిదారులను హక్కుదారులుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పగడ్బందీగా పూర్తిచెయ్యడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు మొదలు పెట్టాలని జేసీ ఎస్ రామ్‌సుందర్ రెడ్డి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, జిల్లా మేనేజర్ పి భార్గవరామ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దాలి


మాట్లాడుతున్న ప్యానల్ లాయర్ అంబేద్కర్

భీమవరం అర్బన్: తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించడమే కాక, భవిష్యత్తులో ఉన్నతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత వారిపై ఉందని ప్యానల్ లాయర్ పులిదిండి అంబేద్కర్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరం తాడేరు రోడ్డు ఇందిరమ్మ కాలనీలోని జీఎంసీ బాలయోగి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అంబేద్కర్ మాట్లాడుతూ వీధి బాలల దినోత్సవం ప్రాథమిక లక్ష్యం యువతకు అత్యవసర సహాయం, ఆహారం, దుస్తువులు, నివాసం, విద్యను అందించడమని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అన్ని వసతులతో నాణ్యమైన విద్యను సర్కారు పాఠశాలల్లో అందిస్తోందన్నారు. అంతేకాక పేద విద్యార్థుల కోసం అమ్మఒడి, జగనన్న విద్యా కానుక తదితర ఎన్నో పథకాలు అమలు చేస్తోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్నారు. పిల్లలు విషయంలో ఏమైనా సమస్యలు తలెత్తితే మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని కోరారు. చైల్డ్ కేర్ టోల్ ఫ్రీ నెంబర్ 1098కి ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.రంగనాథ్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మహేశ్వరి, సీఆర్పీ నాగలక్ష్మి, మహిళా పోలీస్ పిషోన్ రాణి, పారా లీగల్ వలంటీర్ కమల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

జూడో పోటీల్లో విద్యార్థికి బంగారు పతకం

భీమవరం: ఈనెల 30వ తేదీ మంగళవారం విజయవాడలోని పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జేఎన్‌టీయూకే అంతర్ కళాశాలల జూడో పోటీల్లో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి దొండపాటి సింహాద్రి గోల్డ్ మెడల్ సాధించినట్లు కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు తెలిపారు. బుధవారం సింహాద్రిని కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు సత్కరించారు. జనవరి 30న విజయవాడ పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జూడో పోటీల్లో ప్రతిభచూపిన సింహాద్రి ఫిబ్రవరి 5, 6 తేదీల్లో అమృతసర్‌లోని గురునానక్ విశ్వవిద్యాలయంలో జాతీయస్థాయి జూడో పోటీలకు జేఎన్‌టీయూకే జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తాడని జగపతిరాజు అన్నారు. సింహాద్రిని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బీహెచ్‌వీఎస్ రామకృష్ణంరాజు, ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ హరిమోహన్ అభినందించారు.

8న ఉండి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఉండి: ఈనెల 8వ తేదీ గురువారం ఉదయం 10:30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రవీంద్ర తెలిపారు. సమావేశానికి అన్ని గ్రామాల ఎంపీటీసీలు, గౌరవ సభ్యులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.